క్లుప్తంగా

సర్వసిద్ధి వినాయకునికి కుంభాభిషేకం


ప్రత్యేక అలంకరణలో వినాయక స్వామి

శ్రీకాళహస్తి: వేడాం మిట్టకండ్రిగ గ్రామంలో స్వర్గీయ జులుగంటి హరినాథ్ బాబు జ్ఞాపకార్థం కుమార్తె లక్ష్మి సర్వసిద్ధి వినాయక ఆలయం నిర్మించారు. ఆ ఆలయానికి బుధవారం మహా కుంభాభిషేకం నిర్వహించారు. దీనికి జులుగంటి గోపి, గ్రామ పెద్దలు, ప్రజలు పాల్గొన్నారు

నాగలాపురం ఎస్‌ఐగా ఓబయ్య



నాగలాపురం: మండల సబ్ ఇన్‌స్పెక్టర్‌గా టి.ఓబయ్య బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఈయన తిరుపతి వెస్ట్ పోలీస్‌స్టేషన్‌లో పనిచేస్తూ బదిలీపై నాగలాపురం వచ్చారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రజలకు అందుబాటులో ఉంటూ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. శాంతి భద్రతలు, ట్రాఫిక్ సమస్య పరిష్కారానికి తగు చర్యలు తీసుకుంటానని చెప్పారు.

ప్రైవేట్ ప్లాట్లకు మట్టి తరలింపు !

బుచ్చినాయుడుకండ్రిగ: మట్టి వ్యాపారులు గృహ నిర్మాణాల కోసం రెవెన్యూ అధికారుల వద్ద అనుమతి తీసుకుని ప్రైవేటు ప్లాట్లకు గ్రావెల్ మట్టిని తరలించడంపై మండల ప్రజలు ఆందోళన వ్యక్తం చేశారు. మంగళ, బుధవారాల్లో గృహాలకు మట్టిని తోలుకోవాలని నీర్పాకోటకు చెందిన వారు రెవెన్యూ అధికారుల వద్ద అనుమతి తీసుకున్నారు. అయితే వారు బుచ్చినాయుడుకండ్రిగలోని ప్రైవేటు ప్లాట్లకు తరలించారు. మట్టి వ్యాపారాలకు రెవెన్యూ అధికారులు అడ్డుకట్ట వేయాలని మండల ప్రజలు కోరుతున్నారు.

ఎమ్మార్పీకే ఎరువులు విక్రయించాలి


వరదయ్యపాలెంలో ఎరువుల దుకాణంలో తనిఖీ చేస్తున్న ఏడీఏ సుబ్రమణ్యం

వరదయ్యపాళెం: ఎరువులు, విత్తనాలు, పురుగు మందులను ప్రభుత్వం నిర్ణయించిన ఎమ్మార్పీ ధరలకే విక్రయించాలని, నిబంధనలు అతిక్రమిస్తే కఠిన చర్యలు తప్పవని సత్యవేడు వ్యవసాయశాఖ ఏడీఏ సుబ్రమణ్యం హెచ్చరించారు. బుధవారం వరదయ్యపాళెంలోని ఎరువులు, విత్తనాలు, పురుగు మందులు విక్రయించే దుకాణాలను ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా స్టాకు, విక్రయ రికార్డులను పరిశీలించారు. మందులు కొనుగోలు చేసే రైతులకు తప్పనిసరిగా రశీదులు ఇవ్వాలన్నారు. దుకాణాల వద్ద ధరల పట్టిక తప్పనిసరిగా ఉంచాలని, అలాగే ప్రభుత్వం నిర్దేశించినవి మాత్రమే విక్రయించాలన్నారు. నాణ్యతలో తేడాలు వస్తే లైసెన్సులు రద్దు చేస్తామని హెచ్చరించారు. ఆయన వెంట ఏఓ సుహర్‌లత, సిబ్బంది ఉన్నారు.


పాలిటెక్నిక్‌లో ప్రవేశాలకు దరఖాస్తులు

చంద్రగిరి: పాలిసెట్ ద్వారా భర్తీకాని ఖాళీగా ఉన్న సీట్ల భర్తీకి దరఖాస్తులు ఆహ్వానిస్తున్న చంద్రగగిరి ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్ సుకుమార్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. పాలిసెట్ రాసి కౌన్సెలింగ్‌లో సీట్లు రాని వారు, 10వ తరగతి ఉత్తీర్ణులైన వారు ఈఈఈ, ఈసీఈ కోర్సుల్లో చేరేందుకు ఈ నెల 30వ తేదీలోపు పాలిటెక్నిక్ కళాశాలలో దరఖాస్తు చేసుకోవాలని కోరారు. వివరాలకు 9502603571, 8019729162లో సంప్రదించాలని సూచించారు.

గ్రంథం ఆవిష్కరణ

తిరుమల: ది హిందూ గ్రూప్ ఆఫ్ పబ్లికేషన్స్ ముద్రించిన 'ది డివైన్ హిస్టరీ ఆఫ్ శ్రీ అనంతాళ్వార్' తమిళ పుస్తకాన్ని బుధవారం తిరుమలలో పెద్దజీయంగార్‌స్వామి, చిన్నజీయంగార్ స్వామి ఆవిష్కరించారు. పెద్దజీయంగార్‌స్వామి మాట్లాడుతూ 1053- 1138 మధ్య కాలంలో తిరుమల కొండపై నివసించిన శ్రీ వైష్ణవ భక్తుడు అనంతాళ్వార్ చరిత్రను ఈ గ్రంథం వెలుగులోకి తెస్తోందన్నారు. అనంతాళ్వార్ తిరుమల పుణ్యక్షేత్రంలో పుష్ప కైంకర్యాన్ని ప్రారంభించారని, పూలతోటలను అభివృద్ధి చేసి ప్రతిరోజూ పూలమాలలు సమర్పించారని వివరించారు. అనంతాళ్వార్ తోటలో జరుపుకునే పవిత్రమైన బాగ్ సవారీ రోజున ఈ పుస్తకం విడుదల చేయడం సంతోషంగా ఉందన్నారు. గురువు పట్ల భక్తి, శక్తిని అర్థం చేసుకోవడానికి పుస్తకాన్ని చదవాలని భక్తులకు పిలుపునిచ్చారు. ఈ పుస్తకాన్ని తెలుగులో హైదరాబాద్‌కు చెందిన పీవీ రామిరెడ్డి రాశారు. తమిళంలో రాజి రఘునాథన్ అనువదించారు.

సప్త వర్ణ శోభితం



తిరుపతి నగరంపై నీలి మేఘాలు దోబూచులాడాయి. అడపాదడపా చిరుజల్లులు కురిపించాయి. బుధవారం సాయంత్రం ఆకాశం మేఘావృతమైంది. అదే సమయంలో భానుడు హస్తాద్రిపై చేరాడు. అరుణ కిరణాలతో మేఘాలు సప్తవర్ణాలను రంగరించుకుని కనువిందు చేశాయి. ఈ దృశ్యాలు పేరూరు బండపై వెలసిన వకుళమాత ఆలయంపై కనిపించింది. ఈ అద్భుత దృశ్యాన్ని తిలకించిన స్థానికులు మైమరచిపోయారు. తమ సెల్‌ఫోన్లలో బంధించుకుని మురిసిపోయారు.

– సాక్షి ఫొటోగ్రాఫర్, తిరుపతి





మన దేశ సంపద అంబేడ్కర్


శాసన సభలో ప్రసంగిస్తున్న ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్ రెడ్డి

శ్రీకాళహస్తి: మన దేశ సంపద అయిన డాక్టర్ అంబేడ్కర్ విగ్రహాన్ని 110 అడుగులతో ఏర్పాటు చేసిన జగనన్న ప్రజల అభినందనలు అందుకుంటున్నారని ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్ రెడ్డి చెప్పారు. శాసన సభ సమావేశంలో బుధవారం అంబేడ్కర్ విగ్రహం ఏర్పాటు పై మాట్లాడారు. దివంగత వైఎస్సార్ వడదుగులేస్తే జగనన్న 110 అడుగులు ముందుకేసి డాక్టర్ అంబేడ్కర్ విగ్రహం ఏర్పాటు చేసి ఆంధ్రప్రదేశ్ తలెత్తుకునేలా చేశాడన్నాడు. దేశ రాజధాని ఢిల్లీలో గేట్‌వే, హైదరాబాదులో చార్మినార్ ఎలాగో ఇప్పుడు విజయవాడలో అంబేడ్కర్ విగ్రహం అలా నిలిచిపోతుందని తెలిపారు. అన్ని రాష్ట్రాల ముఖ్యమంత్రులను పిలిచి విగ్రహ ప్రారంభోత్సవాన్ని ఒక పండుగలా చేయాలని ఆయన ఆకాంక్షించారు.

పాలిటెక్నిక్‌లో నేరుగా ప్రవేశాలకు అవకాశం

సత్యవేడు: పదో తరగతి పాసైన విద్యార్థులు నేరుగా ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలోని డిప్లొమా ఇన్ సివిల్ ఇంజినీరింగ్, ఎలక్ట్రానిక్ ఇంజినీరింగ్, ఎలక్ట్రికల్ ఇంజినీరింగ్, మెకానికల్ ఇంజినీరింగ్ కోర్సుల్లో చేరవచ్చని ప్రిన్సిపల్ జి.ఉషాదేవి తెలిపారు. ఇటీవల వరకు పాలిటెక్నిక్ ఎంట్రన్స్ పాసైన విద్యార్థులకు కౌన్సెలింగ్ ద్వారా కళాశాలలో ప్రవేశాలు కల్పించినట్లు పేర్కొన్నారు. ప్రస్తుతం ప్రభుత్వ ఆదేశాల మేరకు వచ్చే నెల 2వ తేదీలోపు ఆసక్తి గల విద్యార్థులు అప్లికేషన్లు కళాశాలలో ఇవ్వాలన్నారు. 3వ తేదీ స్పాట్ అడ్మిషన్లు సత్యవేడు పాలిటెక్నిక్ కళాశాలలో నిర్వహించనున్నట్లు ఆమె తెలిపారు. ఫీజుకు సంబంధించిన వివరాలకు 9010222185, 9866207825 నంబర్లలో సంప్రదించాలని కోరారు.

మెలకువలు నేర్చుకుని బోధించాలి


సమావేశంలో మాట్లాడుతున్న రఘురాం

ఏర్పేడు: సాంకేతిక నైపుణ్యంలోని మెలకువలను నేర్చుకుని ఉపాధ్యాయులు విద్యార్థులకు విద్యాబోధన అందించాలని వడమాలపేట ఎంఈఓ రఘురాం అన్నారు. ఏర్పేడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో బుధవారం వడమాలపేట, రేణిగుంట, ఏర్పేడు మండలాల ఇంగ్లీషు సీఆర్పీల పరిధిలోని ఇంగ్లీషు బోధించు ఉపాధ్యాయులకు శిక్షణ ఇచ్చారు. ఆయన మాట్లాడుతూ విద్యార్థులకు సులభ రీతిలో పాఠ్యాంశాలను బోధించాలని సూచించారు. ప్రతి విద్యార్థికి వైట్ బోర్డుపై రాయడం రావాలని పేర్కొన్నారు. పోటీ ప్రపంచంలో విద్యార్థి తట్టుకుని నిలబడాలంటే ప్రాథమిక విద్య పునాదని వెల్లడించారు. విద్యార్థుల సామర్థ్యాలను పెంపొందించాలని చెప్పారు. కార్యక్రమంలో ఎస్సార్పీ సుబ్రమణ్యం, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

శ్రీకాళహస్తి హరిత హోటల్ మేనేజర్‌కు అవార్డు


మంత్రి రోజా చేతుల మీదుగా అవార్డు అందుకుంటున్న బండి శ్రీహరిప్రసాద్ రెడ్డి

శ్రీకాళహస్తి: ప్రపంచ పర్యాటక దినోత్సవం సందర్భంగా శ్రీకాళహస్తి హరిత హోటల్ మేనేజర్ బండి శ్రీహరిప్రసాద్ రెడ్డికి ఉత్తమ హోటల్ మేనేజర్ అవార్డు వచ్చింది. తుమ్మలపల్లి కళావేదిక, విజయవాడలో పర్యాటక, యువజన సర్వీసులు మంత్రి రోజా చేతుల మీదుగా మంగళవారం అవార్డు అందుకున్నట్లు హోటల్ నిర్వాహకులు తెలిపారు.

నాణ్యమైన విద్యతోనే విద్యార్థుల పురోగతి


మాట్లాడుతున్న ఎంఈఓ బాలయ్య

శ్రీకాళహస్తి: విద్యార్థులకు సులభమైన పద్ధతిలో బోధించినప్పుడే పురోగతి సాధ్యమవుతుందని ఎంఈవో భువనేశ్వరి అన్నారు. మండలంలోని వాంపల్లి జిల్లా పరిషత్ పాఠశాలలో స్కూల్ కాంప్లెక్స్ సమావేశం నిర్వహించారు. విద్యాబోధనలో సాంకేతిక పద్ధతులను అనుసరించాలని తెలిపారు. అక్కుర్తి స్కూల్ కాంప్లెక్స్ సమావేశంలో ఎంఈఓ బాలయ్య మాట్లాడుతూ విద్యార్థి అభ్యసనా స్థాయిని బట్టి బోధించాలని అప్పుడే విద్యార్థి వారి సామర్థ్యాన్ని మెరుగుపరుచుకోగలరని తెలిపారు. రిసోర్స్ పర్సన్ యుగంధర్ విద్యార్థుల బోధనలో మెలకువలు ఉపాధ్యాయులకు సూచించారు. ఈ కార్యక్రమంలో స్కూల్ కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు లక్ష్మయ్య పురుషోత్తం రాజు ప్రాథమిక పాఠశాలల ఉపాధ్యాయులు ప్రధానోపాధ్యాయులు, సీఆర్పీలు కృష్ణయ్య, గాంధీ, ధన శేఖర్, ప్రజా ప్రగతి ట్రస్ట్ కో–ఆర్డినేటర్ చంద్రశేఖర్, ప్రగతి కో–ఆర్డినేటర్ ప్రభాకర్ పాల్గొన్నారు.

వైభవంగా ప్రదోష పూజలు


ప్రదోష పూజలు నిర్వహిస్తున్న అర్చకులు

నాగలాపురం: శ్రీ పళ్లికొండేశ్వర స్వామి ఆలయంలో నందీశ్వర స్వామికి, శ్రీవాల్మీకేశ్వర స్వామికి ఏకకాలంలో ప్రదోష పూజలు వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఉదయం ఆలయంలో పరివార దేవతలకు విశేష అలంకరణ చేసి భక్తులకు సర్వదర్శనం కల్పించారు. సాయంత్రం 4 గంటలకు నందీశ్వరుడికి పాలు, పెరుగు, తేనె, నెయ్యి, కొబ్బరి నీళ్లతో అభిషేకం నిర్వహించి, అనంతరం భక్తులు సమర్పించిన పుష్పాలతో నందీశ్వరున్ని అలంకరించారు. ఈ ప్రదోష పూజలకు ఉభయదారులుగా చెన్నై పెరంబూరుకు చెందిన నిత్యానంద వారి కుటుంబ సభ్యులు వ్యవహరించారు. ఆలయ చైర్మన్ ఏపీఎం.బాలాజీ రెడ్డి వారిని ఆలయ మర్యాదలతో సన్మానించారు. భక్తులకు స్వామివారి ప్రసాదం అందేలా ఆలయ అధికారి ఈఓ కె.రామ చంద్రా రెడ్డి ఏర్పాట్లు చేశారు.

కవికి మరణం ఉండదు


లగడపాటి భాస్కర్ రచించిన పుస్తకాలు పరిశీలిస్తున్న అంజూరు తారక శ్రీనివాసులు

శ్రీకాళహస్తి: మహా పండితుడు కవి అయిన కీర్తిశేషులు లగడపాటి భాస్కర్‌కి మరణం లేదని, ఆయన రచించిన సుమారు 66 పుస్తకాల సాహిత్యంలో జీవించి ఉన్నారని ధూర్జటి రసజ్ఞ సమాఖ్య సాహితీ కళావేదిక సభ్యులు స్మరించుకున్నారు. పట్టణంలో బుధవారం ధూర్జటి రసజ్ఞ సమాఖ్య సాహితీ కళావేదిక వారి ఆధ్వర్యంలో కీర్తిశేషులు లగడపాటి భాస్కర్ సంస్మరణ సభ నిర్వహించారు. ఆయన ఆత్మ శాంతించాలని సాహితీ కళావేదిక సభ్యులు శ్రద్ధాంజలి ఘటించారు. ముఖ్య అతిథిగా శ్రీకాళహస్తీశ్వర స్వామి వారి దేవస్థానం ధర్మకర్తల మండలి చైర్మన్ అంజూరు తారక శ్రీనివాసులు పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ తమ గురువైన లగడపాటి భాస్కర్ మృతి తెలుగు సాహితీ లోకానికి తీరనిలోటన్నారు. శ్రీకాళహస్తి దేవస్థానంపై భాస్కర్ అనేక పుస్తకాలు రచించారని గుర్తుచేశారు. త్వరలో ఎంతో వ్యయ ప్రయాసలకోర్చి ఆయన రచించిన శ్రీకాళహస్తి మహత్యం పుస్తకం ఆవిష్కరిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో స్వర్ణమూర్తి, మోహన్ కుమార్, అన్నపూర్ణ, రవీంద్ర, జైచంద్ర, గణేష్, గురునాథం, అన్వర్ బాషా, నాగమణి, బికుప్పం ప్రధానోపాధ్యాయులు వెంకటయ్య మొదలైన కవులు, రచయితలు, భాస్కర్ కుటుంబ సభ్యులు, అభిమానులు పాల్గొన్నారు.

ముగిసిన పవిత్రోత్సవాలు

తిరుపతి కల్చరల్: గోవిందరాజస్వామి ఆలయంలో మూడు రోజులుగా చేపట్టిన పవిత్రోత్సవాలు బుధవారం సాయంత్రం పూర్ణాహుతితో ఘనంగా ముగిశాయి. చివరి రోజున ఉదయం సుప్రభాతంతో స్వామిని మేల్కొలిపి తోమాల సేవ, సహస్రనామార్చన చేశారు. అనంతరం ఉత్సవర్లను యాగశాలకు వేంచేపు చేసి వైదిక కార్యక్రమాలు నిర్వహించారు. ఉదయం 10.30 నుంచి 12.30 గంటల వరకు స్నపన తిరుమంజనం చేశారు. సాయంత్రం 5.30 నుంచి 6.30 గంటల వరకు ఉత్సవమూర్తులను ఆలయ నాలుగు మాడ వీధుల్లో ఊరేగించారు. రాత్రి 7.30 నుంచి 9.30 గంటల వరకు ఆలయంలోని యాగశాలలో వైదిక కార్యక్రమాలు, పూర్ణాహుతి చేపట్టి పవిత్రోత్సవాలు ముగించారు. ఆలయ డెప్యూటీ ఈవో శాంతి, ఏఈవో మునిక్రిష్ణా రెడ్డి, ఆలయ ప్రధాన అర్చకుడు ఏపీ.శ్రీనివాస దీక్షితులు, సూపరింటెండెంట్ మోహన్‌రావు, టెంపుల్ ఇన్‌స్పెక్టర్ ధనుంజయ పాల్గొన్నారు.

గిరిజన కాలనీలో తాగునీటికి ఇక్కట్లు




ఖాళీ బిందెలతో నిరసన తెలుపుతున్న గిరిజన మహిళలు, మరమ్మతులకు గురైన ట్రాన్స్‌ఫార్మర్

బుచ్చినాయుడుకండ్రిగ: మండలంలోని కాంపాళెం గ్రామపంచాయతీ పరిధిలోని సెల్లంవారి గిరిజన కాలనీ మహిళలు బుధవారం తాగునీటిని అందించాలని ఖాళీ బిందెలతో నిరసన తెలిపారు. మండలంలోని కాంపాళెం గ్రామపంచాయతీ పరిధిలోని సెల్లంవారి గిరిజన కాలనీలో బోరు మోటారుకు విద్యుత్ సరఫరా నిలిచిపోవడంతో తాగునీటి కోసం గిరిజనులు ఇబ్బంది పడుతున్నారు. కుమారతిప్ప అడవిలో 25 గిరిజన కుటుంబాల వారు నివాసం ఉంటున్నారు. అయితే కాలనీలో తాగునీటి కోసం ఏర్పాటు చేసిన మోటారుకు గత నాలుగు రోజులుగా విద్యుత్ సరఫరా నిలిచిపోవడంతో మోటారు పనిచేయడం లేదు. దీంతో తాగునీటి కోసం గిరిజనులు నానా అవస్థలు పడుతున్నారు. కిలోమీటరు దూరం వెళ్లి పంట పొలాల్లో బోర్ల వద్దకు వెళ్లి నీటిని తెచ్చుకుంటున్నారు. అధికారులు స్పందించి బోరు మోటారుకు విద్యుత్ సరఫరాను అందించి, తాగునీటి సమస్యను పరిష్కరించాలని గిరిజనులు కోరుతున్నారు.

రేపు అశ్విని ఆసుపత్రిలో రక్తదాన శిబిరం

తిరుమల: తిరుమలలోని అశ్విని ఆసుపత్రిలో శుక్రవారం రక్తదాన శిబిరం నిర్వహించనున్నట్టు ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ కుసుమకుమారి తెలిపారు. అక్టోబర్ 2న గాంధీ జయంతి సందర్భంగా శుక్రవారం రక్తదాన శిబిరాన్ని నిర్వహిస్తున్నట్టు తెలిపారు. దాతలు ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 2 గంటల మధ్య రక్తదానం చేయవచ్చని పేర్కొన్నారు.

ఇంటింటికీ జగనన్న ఆరోగ్య సురక్ష




సేవలు అందిస్తున్న వైద్యసిబ్బంది, తలారివెట్టులో సర్వేలో పాల్గొన్న ఎంపీడీఓ నరసింహారావు

నాగలాపురం: జగనన్న ఆరోగ్య సురక్షతో ఇంటింటికీ వైద్యసేవలు అందిస్తున్నాయని నాగలాపురం పీహెచ్‌సీ వైద్యాధికారి విజయ్‌కుమార్ అన్నారు. బుధవారం పీహెచ్‌సీ పరిధిలోని ఎస్ఎస్ పురం గ్రామాల్లో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం నిర్వహించారు. వైద్యసిబ్బందితో కలిసి సుమారు 200 కుటుంబాలను సందర్శించి వైద్యసేవలు అందించారు. జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం గ్రామీణ ప్రాంతాల్లో దీర్ఘకాలిక రోగులకు రాష్ట్రప్రభుత్వం ఊరట కలిగిస్తూ ఇంటి చెంతకే వైద్యసేవలు అందించేలా చర్యలు చేపట్టిందన్నారు. వైద్యసిబ్బంది ప్రతి ఇంటికీ వెళ్లి బీపీ, మధుమేహం, రక్త పరీక్షలు చేసి వారికి టోకెన్లు ఇస్తున్నారని, గ్రామంలో నిర్వహించే వైద్యశిబిరంలో టోకెన్ చూపి వైద్యసేవలు పొందవచ్చన్నారు. కార్యక్రమంలో ఎంఎల్‌హెచ్‌పీ గాయత్రి, వనజాక్షి, పొన్నయ్యన్ పాల్గొన్నారు.

బుచ్చినాయుడుకండ్రిగలో..

బుచ్చినాయుడుకండ్రిగ: మండలంలోని 14 గ్రామ సచివాలయాల పరిధిలోని అన్ని గ్రామాల్లో జగనన్న ఆరోగ్య సురక్ష సర్వే ముమ్మరంగా కొనసాగుతోందని ఎంపీడీఓ నరసింహారావు తెలిపారు. ఆయన బుధవారం స్థానిక పీహెచ్‌సీ పరిధిలోని తలారివెట్టు, కల్లివెట్టు గ్రామాల్లో వైద్యసిబ్బందితో కలసి సుమారు 250 కుటుంబాలను సందర్శించి, వారికి టోకెన్లు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలందరికీ ఆరోగ్యమే లక్ష్యంగా ప్రభుత్వం చేపట్టిన జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంపై ప్రజలకు అవగాహన కల్పించాలని తెలిపారు. అలాగే వైద్య సిబ్బంది ప్రతి ఇంటికీ వెళ్లి బీపీ, మధుమేహం, రక్త పరీక్షలు చేసి వారికి టోకెన్లు ఇస్తున్నారన్నారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

ఆరోగ్య సురక్షను సద్వినియోగం చేసుకోండి


దళవాయి అగ్రహారంలో సర్వేను పరిశీలిస్తున్న ఎంపీడీఓ చంద్రశేఖర్

సత్యవేడు: రాష్ట్రప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీఓ చంద్రశేఖర్ కోరారు. బుధవారం సత్యవేడు పంచాయతీలో నాలుగో సచివాలయ పరిధిలో జరుగుతున్న సర్వేను ఆయన పరిశీలించారు. అనంతరం ఎంపీడీఓ మాట్లాడుతూ ప్రతి ఇంటినీ, కుటుంబాన్ని సురక్షితంగా ఉంచడం కోసం రాష్ట్రప్రభుత్వం జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం నిర్వహిస్తోందన్నారు. ఈ నెల 30వ తేదీ నాటికి ఏఎన్ఎంలు, వలంటీర్లు సర్వేను పూర్తి చేసి అనారోగ్య సమస్యలతో బాధపడుతున్న వారికి హెల్త్ క్యాంపుల్లో వైద్య సేవలు అందేలా చూడాలని ఏఎన్ఎంలు, వలంటీర్లకు ఎంపీడీఓ సూచించారు.

బోధనా నైపుణ్యాలు మెరుగు పరుచుకోవాలి


సమావేశంలో మాట్లాడుతున్న ఎంఈఓ రవి

సత్యవేడు: మారుతున్న కాలానికి అనుగుణంగా ఉపాధ్యాయులు బోధనా నైపుణ్యాలను అభివృద్ధి పరచుకోవాలని ఎంఈఓ కే.రవి అన్నారు. సత్యవేడు బాలికల ఉన్నత పాఠశాలలో బుధవారం నిర్వహించిన ప్రాథమికోన్నత పాఠశాలల స్కూల్ కాంప్లెక్ శిక్షణ సమావేశాన్ని ఆయన పరిశీలించారు. ఉపాధ్యాయులు వృత్తిపరమైన బోధనా నైపుణ్యాలను మెరుగు పరుచుకునేందుకు నిరంతరం కృషి చేయాలని సూచించారు. అందుకు స్కూల్ కాంప్లెక్ సమావేశాలు ఎంతగానో దోహదం చేస్తాయన్నారు. కార్యక్రమంలో రీసోర్సు పర్సన్లు త్యాగరాజులు, హెచ్‌ఎం డీవీ రాజు, 33 పాఠశాలల ప్రధానోపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

పల్లమాలలో వేగంగా అభివృద్ధి పనులు


వీధుల్లోని గుంతలకు మట్టిని తోలుతున్న సిబ్బంది


ఇరువైపులా ముళ్లకంపల తొలగింపు

బుచ్చినాయుడుకండ్రిగ: మండలంలోని పల్లమాల గ్రామంలో సర్పంచ్ రమణమ్మ, జిల్లా వైఎస్సార్ సీపీ ప్రధాన కార్యదర్శి జొన్నల గోపాల్‌రెడ్డి ఆధ్వర్యంలో వేగంగా అభివృద్ధి పనులు చేపట్టారు. కేటీ రోడ్డు నుంచి పల్లమాల గ్రామానికి వచ్చే సిమెంట్ రోడ్డుకు ఇరువైపులా ముళ్లకంప చెట్లను జేసీబీతో తొలగించారు. అదేవిధంగా గ్రామంలోని వీధుల్లో గుంతలను మట్టిని తోలి పూడ్చి వేయించారు. గ్రామంలో పారిశుద్ధ్యం మెరుగు చర్యలు చేపట్టి, గ్రామంతో పాటు దళితవాడలో డ్రైనేజీ కాలువల్లో మురుగును, వీధుల్లో నిల్వ ఉన్న చెత్తాచెదారాన్ని తొలగించి, బ్లీచింగ్ చల్లించారు. తాగునీటి ఓవరు హెడ్ ట్యాంకులో క్లోరినేషన్ చేయించారు. మురుగు నీరు నిల్వ ఉండకుండా చూడాలని, దోమలు వృద్ధి కాకుండా మలాథిన్ స్ప్రే చేయించారు. మురుగునీటి నిల్వ లేకుండా చేశారు. దీంతో గ్రామస్తులు సంతోషం వ్యక్తం చేశారు.

ఇద్దరు యువకులకు తీవ్ర గాయాలు

పిచ్చాటూరు: రోడ్డు ప్రమాదంలో నాగరాజు(25), డేవిడ్(22) అనే ఇద్దరు యువకులు తీవ్ర గాయంగా పడిన సంఘటన బుధవారం చోటు చేసుకుంది. స్థానిక ఎస్‌ఐ వెంకటేశ్వర్లు కథనం మేరకు.. మండలంలోని రామగిరికి చెందిన నాగరాజు, నగరి మండలం తడుకు పేటకు చెందిన డేవిడ్ స్థానిక బైపాస్‌లో రాత్రి 8.30 గంటలకు ద్విచక్రవాహనంపై వెళ్తుండగా ఎదురుగా వస్తున్న లారీ ఢీకొంది. దీంతో వారు తీవ్రంగా గాయపడ్డారు. స్థానికులు పోలీసులకు, 108కు సమాచారం అందించారు. క్షతగాత్రులను చికిత్స నిమిత్తం నగరి ఏరియా ఆస్పత్రికి తరలించారు.

జిల్లా జట్టును విజేతగా నిలపండి



అండర్–17 చిత్తూరు జిల్లా బాలబాలికల జట్టుతో ఎస్‌జీఎఫ్‌ఐ ప్రతినిధులు, పీడీలు

చంద్రగిరి: స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా(ఎస్‌జీఎఫ్‌ఐ) ఆధ్వర్యంలో త్వరలో జరగబోవు జిల్లా స్థాయి వాలీబాల్ పోటీల్లో జిల్లా జట్టును విజేతగా నిలపాలని జిల్లా విద్యాశాఖ అధికారి శేఖర్ తెలిపారు. తిరుపతి రూరల్ మండలం దుర్గసముద్రం జెడ్పీ ఉన్నత పాఠశాలలో బుధవారం జిల్లా వాలీబాల్ జట్టు ఎంపిక కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇందులో డీఈవో ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ వాలీబాల్ పోటీల్లో ఉమ్మడి చిత్తూరు జిల్లాకు మంచి పేరు ఉందన్నారు. సెలక్షన్ కమిటీ తరపున 80 మంది పీడీలు భారీ ఎత్తున ఈ కార్యక్రమాన్ని నిర్వహించడం సంతోషంగా ఉందన్నారు. క్రీడల ద్వారా శారీరక ఆరోగ్యం బాగుంటుందని, మానసిక స్థితిని అదుపులో ఉంచుకోవచ్చన్నారు. ఈ సందర్భంగా తుడా చైర్మన్ చెవిరెడ్డి మోహిత్ రెడ్డి సుమారు 400 మందికి భోజనం ఏర్పాట్లు చేశారు. కార్యక్రమంలో స్కూల్ గేమ్స్ సెక్రటరీ విజయకుమారి, సురేష్‌బాబు, బాబు, వాలీబాల్ సంఘం సెక్రటరీ సిరాజ్ అహ్మద్, సీనియర్ పీడీలు సెల్వపాండియన్, నందకుమార్, మునిశేఖర్, వ్యాయామ విద్య జిల్లా కార్యదర్శి సుబ్రమణ్యం రెడ్డి, సర్పంచు పిపాసి, ఎంపీటీసీ మునిరెడ్డి, పీడీలు విజయకుమారి, ఎంఈఓలు దేవ రాజులురెడ్డి, శంకరయ్య తదితరులు పాల్గొన్నారు.

అండర్–17 బాలుర జట్టు

జట్టులో వాసు, అహ్మద్ షఫీ, దినేష్, అఖిల్ ఆర్య, శంకర్ నాయక్, కృష్ణ, ఉదయ కిరణ్, హేమాద్రి, శివ కుమార్, జీవన్ కుమార్, అజయ్ ఉస్మాక్ ఉన్నారు.

అండర్–17 బాలికల జట్టు

జట్టులో షణ్ముక ప్రియ, జాహ్నవి, రామశ్రావణి, పల్లవి, మానస, చరిత, జయశ్రీ, శ్వేత, ఇందు, శిరీష, వైష్ణవి, జోత్స్న ఉన్నారు. వారికి డీఈవో శేఖర్, తుడా చైర్మన్ చెవిరెడ్డి మోహిత్ రెడ్డి అభినందనలు తెలిపారు.